బడిబాట సరే.. సౌకర్యాలేవీ?

- రాగన్నగూడ, హయత్‌నగర్ పాఠశాలల్లో సరిపడాలేని ఉపాధ్యాయులు
- ప్రభుత్వ పాఠశాలల్లో కానరాని మౌలిక సదుపాయాలు


వ్యర్థాలతో నిండిన మురుగునీటి కాల్వ


బిల్లులు రాక అసంపూర్తిగా మిగిలి పోయిన కిచెన్ షెడ్డు నిర్మాణం

హయత్‌నగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీంతో విద్యార్థుల సంఖ్య ఎంతో కొంత పెరిగే అవకాశం ఉంది. కానీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడంతోనే సమస్య వచ్చిపడింది. ఉన్న విద్యార్థులకే సరిపడ ఉపాధ్యాయులు లేరు. తరగతి గదులు లేవు, స్కావెంజర్‌లు లేరు, అటెండర్‌లు లేరు, మూత్రశాలలు లేవు, మరుగుదొడ్లు లేవు, వాచ్‌మెన్‌లు లేరు, తాగునీరు సరిగా లేదు, అపరిశుభ్ర పరిసరాలు, పాఠశాలకు ప్రహరీలులేవు, గేట్లు సరిగాలేవు, పీఈటీ ఉపాధ్యాయులు లేరు ఇలా రకరకాల సమస్యలతో ప్రభుత్వ పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడ, హయత్‌నగర్ మండలంలోని హయత్‌నగర్ జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో సమస్యలు తిష్టవేశాయి. అయినా అధికారులు పాలకులు కనీసం పట్టించుకోవడం లేదు. చేసేది లేక ఉపాధ్యాయులు ఎలాగో నెట్టుకువస్తున్నారు. రాగన్నగూడ ప్రభుత్వ పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులకు కేవలం 10మంది ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలలో 200మంది విద్యార్థులకు కేవలం ముగ్గురు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు. హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 1300 మంది విద్యార్థులకు గాను కేవలం 19మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అక్కడ ఇంకా 20మంది ఉపాధ్యాయులు అవసరం ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి 30మంది విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయుడు ఉండాలి. ఇక్కడ 50మంది విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయుడు ఉన్నారు. ప్రైమరీ స్కూల్‌లో తరగతి గదులు ఊడ్చేవారు లేరు, బాత్‌రూం క్లీనర్లు లేరు, ఇక్కడ మరో ముగ్గురు టీచర్లు, మూడు తరగతి గదులు అవసరం ఉంది.

మన ఊరు మన బడి కింద ఎంపికైనా..

రాగన్నగూడ పాఠశాల మన ఊరు మన బడి కింద ఎంపికైంది. అందు లో భాగంగా రూ.62లక్షలు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ టాయిలెట్స్, కిచన్‌షెడ్డు సగం వరకు నిర్మించారు. ప్రభుత్వం నుంచి చిల్లి గవ్వ రాక కాంట్రాక్టరు పనులు మధ్యలో ఆపి వెళ్లారు. ప్రస్తుతం ప్రైమరీ పాఠశాల టాయిలెట్స్ వాడుతున్నారు.


హయత్‌నగర్‌లో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

రెండు సెక్షన్‌లకు ఒకే తరగతి గది..

రాగన్నగూడ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి ఒకే తరగతిని రెండు సెక్షన్‌లుగా విభజించారు. సరిపడ ఉపాధ్యాయులు లేక రెండు సెక్షన్‌లను కలిపి తరగతులు నిర్వహిస్తున్నారు. 500 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ) లేకపోవడం శోచనీయం. అక్కడ మరో ఐదుగురు ఉపాధ్యాయులు, 5తరగతి గదులు అవసరం ఉంది. స్కావేంజర్ లేకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులే తరగతి గదులు ఊడ్చుకునే స్థితి నెలకొంది. పాఠశాలలో అపరిశుభ్ర పరిసరాలు నెలకొన్నాయి. గేటు సరిగాలేక రాత్రివేళలో పాఠశాల మందు బాబులకు అడ్డాగా మారింది. పరిసరాల శుభ్రత పనులు రెండు సంవత్సరాల క్రితం తుర్కయంజాల్ మున్సిపాలిటీకి అప్పగించారు. తాగునీటి ట్యాంకు నాచుతో వాసనకొడుతుంది. చైర్మన్, కమిషనర్ పట్టించుకోకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు.

పాఠశాల ఎదుటే మురుగు కాల్వ (ఓపెన్ నాలా)

ప్రభుత్వ పాఠశాల ముందు ప్రహరీని ఆనుకుని భారీ సైజు ఓపెన్ నాలా ఉంది. అందులో చెత్తా, చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పెరుకుపోయి దుర్గంధంవస్తుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు అనారోగ్యానికి గురవుతున్నారు. పై కప్పులేక విద్యార్థులకు ప్రమాదాలు జరుగుతున్నా యి. పాఠశాల ప్రహరీ ముందు పలు వాహనాలను పార్కింగ్ చేస్తున్నా రు. విద్యార్థులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా రాగన్నగూడ ప్రభుత్వ పాఠశాలను పాలకులు, అధికారులు గాలికి వదిలివేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హయత్‌నగర్‌లోను అదే పరిస్థితి

- మన ఊరు మన బడిలో చేపట్టిన పనులన్నీ అసంపూర్తిగానే..

హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల మన ఊరు మన బడి కార్యక్రమంలో ఎంపికైంది. అందులో భాగంగా వివిధ అభివృద్ధి పనులకు గాను ప్ర భుత్వం రూ.48లక్షలు మంజూరు ఇచ్చింది. దీంతో కాంట్రాక్టర్ కిచెన్ షెడ్డు, వాష్‌రూంల నిర్మాణం మొదలుపెట్టారు. నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు మధ్యలో ఆపివేశారు. కొన్ని తరగతి గదుల్లో కరెంటు సౌ కర్యం ఉంది. కొన్ని గదులకు లేదు. ఫ్యాన్లులేవు, తలుపులు సరిగాలేవు, వి ద్యార్థులు కూర్చోవడానికి బెంచీలులేవు. ఆరు ఉపాధ్యాయ పోస్టులు నేటికి ఖాళీగా ఉన్నాయి. పాఠశాల మొత్తానికి సాంఘీకశాస్త్రం, బయాలజీ, తెలుగు, హింది బోధన చేయడానికి ఒక్కొక్క ఉపాధ్యాయుడే ఉన్నాడు.

రూ.44లక్షలతో బాక్స్‌డ్రెయిన్ నిర్మాణం: బలాల


సివరేజీ సమస్యను జలమండలి అధికారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : చావునీ డివిజన్‌లోని డబీర్‌పుర బ్రిడ్జి ఎదుట నున్న చంచల్‌గూడ రోడ్‌లో నూతన బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ప్రతిపాదించారు. ఈ మేరకు ఆయన గురువారం చంచల్‌గూడ రోడ్‌లో చావునీ డివిజన్ కార్పొరేటర్ సలాం షాహిద్‌మూన్, జలమండలి మలక్‌పేట డివిజన్ డీజీఎం శీలారాణితో కలిసి పర్యటించారు. డబీర్‌పుర బ్రిడ్జి ఎదుటనున్న చంచల్‌గూడ రోడ్‌లోని నివాసాల, అపార్ట్‌మెంట్ల నుంచి ఉన్న డ్రైనేజీ పైప్‌లైన్‌ను సమీపంలో ఉన్న నాలాలోకి కలిపారని, దీంతో వరద తాకిడికి నాలా ఉప్పొంగి ప్రవహించినప్పుడల్లా మురుగు ఇళ్లలోకి వస్తుందన్న ఫిర్యాదులపై ఎమ్మెల్యే స్పందించారు. ఈమేరకు జలమండలి అధికారులతో ఆయన పర్యటించి డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కొత్తగా బాక్స్ డ్రెయిన్‌ను నిర్మించి సివరేజీ లైన్‌కు కలపాలని నిర్ణయించారు. ఇందుకు నూతన బాక్స్‌డ్రెయిన్ నిర్మాణానికి రూ.45లక్షల వరకు వ్యయమవుతుందని జలమండలి అధికారులు ప్రతిపాదించడంతో వీలైనంత త్వరగా నిధులను మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

బక్రీద్ ఏర్పాట్ల పరిశీలన


మాదన్నపేట ఈద్గాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్

సైదాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని మాదన్నపేట ఈద్గాలో చేపడుతున్న ఏర్పాట్లను రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌లు వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రత్యేక ప్రార్థనలకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి, ట్రాఫిక్, మాదన్నపేట పోలీసులు, వైద్య, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

చెత్తను స్వచ్ఛఆటోలకు అందజేయాలి: రాజశేఖర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: చెత్తను రోడ్లపై వేయకుండా స్వచ్ఛఆటోలకు అందజేయాలని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి గురువారం ప్రజలను కోరారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని లింగోజిగూడ ఓల్డ్‌విలేజ్‌లో రోడ్డు పక్కనే చెత్తవేస్తుండడంతో ఆ చెత్తను తొలగింపజేసి అక్కడ బీటి వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్త వేరు చేసి జీహెచ్‌ఎంసీ స్వచ్ఛఆటోలకు అందజేయాలని సూచించారు.

తిరుమలహిల్స్ అధ్యక్షుడిగా తీగల కృష్ణారెడ్డి

సైదాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ డివిజన్ తిరుమల హిల్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మాజీ మేయర్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి నియమితులైన సందర్భంగా గురువారం కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి దంపతులు తీగలను సన్మానించారు. అనంతరం కాలనీలో పాదయాత్ర నిర్వహించి సమస్యలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు నర్సింహారెడ్డి, అర్జున్‌రెడ్డి, శ్రీనాథ్, జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, విద్యుత్ ఏఈ వేణుగోపాల్, జలమండలి మేనేజర్ శ్రావణ్ పాల్గొన్నారు.

అమెరికన్ కాన్సులేట్ వద్ద నిరసనకు యత్నం

- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాయదుర్గం: అమెరికా నిఘా సంస్థలు డైరెక్టెడ్ వెపెన్స్‌తో తమ వ్యక్తిగత హక్కులకు భంగం కలిగించడంపై టార్గెటెడ్ ఇండ్యూవిజువల్స్ ఆఫ్ ఇండియా కన్వీనర్ రావి తరుణ్ ఆధ్వర్యంలో దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన మరో నలుగురు సభ్యులతో కలిసి నానక్‌రాంగూడలోని అమెరికన్ కాన్సులేట్ వద్ద నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్నట్లు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందింది. వారు రావి తరుణ్‌తో సహా మరో ముగ్గురిని గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ ఉద్యోగాల కోసం అమెరికాకు వెళ్లిన భారతీయులు, భారతి సంతతికి చెందిన చాలా మంది నిఘా వేధింపులకు గురవుతున్నారని అన్నారు. న్యూరో వెపన్స్ ద్వారా అమెరికా నిఘా సంస్థలు అమెరికాలో ఉంటున్న వివిధ విదేశీ సమూహాలపైన నిఘా పెట్టి వేధిస్తున్నాయని ఆరోపించారు. ప్రారంభంలో అమెరికా పరిశోధన కేంద్రాల్లో నిమగ్నమై ఉన్న టెక్నాలజీ క్రమంగా అమెరికా ప్రభుత్వాన్ని శాసిస్తున్న కార్పొరేటర్ శక్తులకు అవసరంగా మారిందన్నారు. ఈ సమస్యపై అందరికి అవగాహన కల్పించి జాగృతం చేయడమే తమ లక్ష్యమని తరుణ్ పేర్కొన్నారు. న్యూరో వెపన్స్ గురించి హవాన సిండ్రోమ్, సింథటిక్ టెలిపతి గురించి ఎవరికి వారు పరిశోధన జరిపి నిగ్గుతేల్చుకుని వినాశనాన్ని అడ్డుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ పోలీసు అరెస్టులు తమ కార్యక్రమాన్ని ఆపవని, భవిష్యత్‌లో పలు సెమినార్లు వర్క్‌షాపులు నిర్వహించి ప్రజల్లో అవగాహన తీసుకువస్తామని అన్నారు. వ్యక్తిగత పూచికత్తుపై వారిని వదిలిపెట్టినట్లు ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు

- బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ వాన్ ఒవెన్


పేపర్ ప్లేట్ మెషీన్‌ను పరిశీలిస్తున్న గారేత్ వాన్ ఒవెన్

అడ్డగుట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పేపర్ ప్లేట్ మిషిన్ అందజేస్తున్నట్లు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ వాన్ ఒవెన్ తెలిపారు. గురువారం లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రేమలీల ట్రాన్స్‌జెండర్ కార్యాలయంలో పేపర్ ప్లేట్ మెషీన్‌ను ఆయన అందజేశారు. ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి తోడ్పాటునందిస్తున్న హాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాదాను ఆంథోనిని అభినందించారు. ట్రాన్స్ కమ్యూనిటీ లీడర్ వైజయంతి మాట్లాడుతూ హాస్ సంస్థ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌జెండర్లకు సూచించారు. ఆంథోని మాట్లాడుతూ వ్యాపార కేంద్రాల ఏర్పాటుకు ట్రాన్స్‌జెండర్లకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

బీదర్, పద్మావతి రైలులో దొంగలు పడ్డారు

- ఎస్-4,9,10 బోగిలలో చోరీ
- పలువురి మెడల్లోని బంగారు గొలుసులు అపహరణ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ : బీదర్, పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైల్లో దొంగలు పడ్డారు. విజయవాడ నుంచి సికింద్రాబాద్ వైపు వస్తున్న పద్మావతి, బీదర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఎస్- 4,9,10 బోగిలోని ప్రయాణికుల మెడల్లోని బంగారు గొలుసులు తెంచుకుని పారిపోయారు. ఈ ఘటన చింతకాని మండలం పందిళ్లపల్లి వద్ద చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై మాజీద్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ మధ్యలో సిగ్నల్ కట్ చేయడంతో రైలు ఆగిపోయింది. ఆ సమయంలో కింద రైలు పట్టాలపై ఉన్న నలుగురు దొంగలు ఎస్- 4,9,10 బోగిలలో కిటికీల పక్కన కూర్చున్న ప్రయాణికులు మెడలలోని బంగారు గొలుసులు తెంచుకుని పారిపోయారు. ఎస్4 బోగిలో ప్రయాణం చేస్తున్న పద్మావతి అనే మహిళ మెడలో 4 గ్రాములు బంగారు గొలుసు, వర్ధనమ్మ మెడలో నుంచి 20 గ్రాముల బంగారు గొలుసు, వి.కుమార్ అనే ప్రయాణికుడి మెడలో 16 గ్రాముల బంగారు గొలుసు, జనరల్ బోగిలో ప్రయాణం చేస్తున్న కీర్తన బ్యాగులో ఉన్న రూ.13 వేల నగదు కిటికీల నుంచి ఎత్తుకెళ్లిపోయారు. బాధిత ప్రయాణికులందరూ గురువారం సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదుల చేశారు. కేసు నమోదు చేసుకున్న జీఆర్‌పి పోలీసులు ఖమ్మం జీఆర్‌పీ పోలీసులకు బదిలీ చేశారు. సిగ్నల్ కట్ చేసి రైళ్లలో దోపిడికి పాల్పడినట్లు విచారణలో తెలిసింది.

కంటైనర్‌లో తరలిస్తున్న 104 ఆవులు స్వాధీనం

కోదాడ రూరల్, జూన్ 13 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న 104 ఆవులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోదాడ రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అజీద్‌ఖాన్, యూసఫ్, సలీం ఆంధ్రప్రదేశ్‌లోని హనుమాన్ జంక్షన్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా 104 ఆవులను కంటైనర్‌లో తరలిస్తున్నారని సమాచారం అందింది. గురువారం కోదాడ పోలీసులు రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ ప్రారంభించారు. కంటైనర్‌ను గుర్తించి, ఆవులను, కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆవులను ఏపీ రాష్ట్రంలోని వేదాద్రి దేవాలయ గోశాలకు తరలించి, సంబంధితులతో పాటు వాహన డ్రైవర్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌కు తొలి ప్రాధాన్యం

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- బాలాపూర్ చౌరస్తా-ఉద్యోగ్‌నగర్ రోడ్డులో ప్రారంభం


లెనిన్‌నగర్‌లో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రధాన రహదారుల విస్తరణతో పాటు ఆయా రోడ్లపై సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చిందని మహేశ్వరం ఎమ్మెల్యే పీ.సబితారెడ్డి అన్నారు. ఇందులో భాగంగా బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోకి వచ్చే బాలాపూర్ చౌరస్తా నుంచి నాదర్‌గుల్ వరకు గల రహదారిపై సెంట్రల్ లైటింగ్‌కు రూ.2.50కోట్లు మంజూరు చేయించామని ఆమె పేర్కొన్నారు. మీర్‌పేట్ పరిధిలోని లెనిన్‌నగర్ నుంచి ఉద్యోగ్‌నగర్ కమాన్ వరకు గల రోడ్డుపై రూ.50లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ సిస్టమ్‌ను బుధవారం రాత్రి సబితారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంతకు ముందు బడంగ్‌పేట్ పరిధిలోని ఉద్యోగ్‌నగర్ నుంచి గాంధీనగర్ వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించామని, గాంధీనగర్ నుంచి నాదర్‌గుల్ వరకు గల మిగతా పనులను తొందరగా పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌గుప్తా, కౌన్సిల్ బీఆర్‌ఎస్, బీజేపీ ఫ్లోర్ లీడర్లు భూపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్యబీరప్ప, పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పాఠశాల భవనం ప్రారంభం: మేయర్


పాఠశాల భవనంపై తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ కుర్మల్‌గూడ 10వ డివిజన్‌లోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహ సముదాయం కాలనీలో త్వరలో పాఠశాల నూతన భవనం ప్రారంభించనున్నట్టు మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పేర్కొన్నారు. అక్కడ జరుగుతున్న భవన నిర్మాణ పనులను గురువారం ఎంఈవో కృష్ణతో కలిసి ఆమె పరిశీలించారు. తరగతి గదులు, బాత్‌రూమ్‌లు, తాగునీటి ఏర్పాటు వంటి వసతులను పరిశీలించిన అనంతరం మేయర్ మాట్లాడుతూ పేద ప్రజానీకం అధికంగా నివసించే ఈ కాలనీలో కొత్తగా పాఠశాల ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ పెద్దలు, కలెక్టర్, డీఈవో తదితరులు ఎంతగానో సహకరించారని అన్నారు. పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయని, వీలైనంత త్వరలో భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి పాఠశాలను ప్రారంభిస్తామని ఆమె చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ జ్యోతీరెడ్డి, కార్పొరేటర్ రోహిణీరమేశ్‌ముదిరాజ్, నాయకులు అనంద్‌రెడ్డి, మల్లారెడ్డి, జంగయ్య, సాదిక్, కుమారి, మైనా, జహంగీర్, రమేశ్ పాల్గొన్నారు.

ఎస్‌ఎన్‌డీపీ పనులు వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే


ఎస్‌ఎన్‌డీపీ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎన్‌డీపీ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలో కొనసాగుతున్న ఎస్‌ఎన్‌డీపీ పనుల పురోగతిపై గురువారం తన నివాసంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడెక్కడ ఎస్‌ఎన్‌డీపీ పనుల్లో జాప్యం జరుగుతున్నదో గుర్తించి ఆ పనుల్లో వేగం పెంచాలన్నారు. ఎస్‌ఎన్‌డీపీ ఫేజ్-2 పనుల్లో తీవ్ర సమస్యలు గుర్తించి దాదాపు రూ. 23కోట్లు మంజూరు చేయించామన్నారు. రూ. 193కోట్లతో చేపట్టిన పనులు దాదాపు పూర్తి కావొచ్చాయన్నారు. అందులో భాగంగానే సమస్యలు ఉత్పన్నమవుతున్న ప్రాంతాల్లో పనులు చేసేందుకు అదనపు నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. పనులు సకాలంలో పూర్తి అయితే నియోజకవర్గంలో వరదనీటి సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం అవుతాయన్నారు. అధికారులను వేధింపులకు గురిచేసే వారిపట్ల కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమీక్షలో అధికారులు కృష్ణయ్య, కార్తీక్, హేమునాయక్, కిరణ్, రఫీ, హస్తినాపురం బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సత్యంచారి, శ్రీనివాస్‌నాయక్, రోహిత్‌రెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా, వ్యభిచార నిర్మూలనకు సహకరించాలి

- ఎల్బీనగర్ ఎస్‌ఐ దయాకర్‌రెడ్డి, ప్రజ్వల్ సంస్థ ప్రతినిధులు


మాట్లాడుతున్న ఎస్‌ఐ దయాకర్‌రెడ్డి

కొత్తపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మనుషుల అక్రమ రవాణా - వ్యభిచార నివారణలకు అందరూ సహకరించాలని ఎల్బీనగర్ ఎస్‌ఐ దయాకర్‌రెడ్డి, ప్రజ్వల్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రయ్య, కోఆర్డినేటర్ సురేష్‌కుమార్ ముక్కెర పిలుపునిచ్చారు. గురువారం రాత్రి ఎల్బీనగర్ పోలీస్, ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ రింగ్ రోడ్డు, ఫ్లైఓవర్ల వద్ద మనుషుల అక్రమ రవాణా, వీధి వ్యభిచారాల నివారణలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సమాజంలో మనుషుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రజ్వల సంస్థ 28 సంవత్సరాలుగా పద్మశ్రీ డాక్టర్. సునీతకృష్ణన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కల్పిస్తోందన్నారు. అత్యాధునిక సాంకేతికతను వాడుతూ నేరస్తులు సైబర్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. స్మార్ట్ ఫోన్ వాడుతున్న వారు తరచూ ఈ సైబర్ మోసానికి గురయ్యే ప్రమాదం ఉందని, సినీ హీరోయిన్‌లు, రాజకీయ నాయకులు సైతం ఇలాంటి సైబర్ మోసాల బారిన పడుతున్నారన్నారు. మనుషులను అక్రమ రవాణా చేసి, వారి శ్రమ దోపిడీ చేయడం, అవయవాల దోపిడీ చేయడం, లైంగిక దోపిడీకి గురి చేయడం జరుగుతోందని వివరించారు. మోసగాళ్లు అమాయకులను టార్గెట్ చేసి డబ్బు ఆశ చూపి మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రధానంగా మహిళలు స్మార్ట్‌ఫోన్‌లో పలు రకాల యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా లైంగిక దోపిడీకి గురవుతున్నారని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా వల్ల నష్టాలు, వారిని కాపాడేందుకు ఉన్న చట్టాలు, ఫిర్యాదు చేయాల్సిన టోల్ ఫ్రీ నెంబర్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రజ్వల సిబ్బంది, వికల్ప్ కోఆర్డినేటర్ సంజయ్, సాయికుమార్, అంబర్‌సింగ్, మిథలిరాజ్, ఆటో యూనియన్ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

రామోజీరావుకు నివాళి అర్పించిన మంత్రి కోమటిరెడ్డి


నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రామోజీ గ్రూపు సంస్థల చైర్మన్ దివంగత రామోజీరావుకు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాళి అర్పించారు. గురువారం ఫిలింసిటీలోని రామోజీ నివాసానికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామోజీరావు క్రమశిక్షణకు మారుపేరని, ప్రజల పక్షాన బలమైన గళాన్ని వినిపించారని అన్నారు. ఈ సందర్భంగా రామోజీతో తనకున్న అనుబంధాన్ని మంత్రి గుర్తుచేసుకున్నారు.

2,800 బస్సులు గమ్యం యాప్‌తో అనుసంధానం

- 'గమ్యం యాప్ సేవలు అంతంతే'కు స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : 'తెలంగాణ ఆర్టీసీ గమ్యం యాప్ సేవలు అంతంతే' అని గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆర్టీసీ అధికారులు స్పందించారు. గ్రేటర్ జోన్ పరిధిలో 2,800 బస్సులను గమ్యం యాప్‌నకు అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. యాప్‌లో బస్సుల వివరాలు నమోదు చేసేందుకు ప్రతీ డిపోలో ప్రత్యేకంగా ఓ ఉద్యోగిని నియమించామని తెలిపారు. డిపో పరిధిలో ఆయా బస్సుల ట్రాకింగ్‌ను ఆ ఉద్యోగి నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. దీనికి సంబంధించి ఏవైనా ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరిస్తున్నామని అధికారులు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని రాణించాలి


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

వనస్థలిపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని రాణించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సరిత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రజిత, నాయకులు పాల్గొన్నారు.

హయత్‌నగర్: బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంజాపూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు గురువారం తుర్కయంజాల్ మున్సిపల్ వైస్ చైర్మన్ హరిత ధన్‌రాజ్‌గౌడ్, కౌన్సిలర్ రవీందర్‌రెడ్డిలు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు. కార్యక్రమంలో గౌస్ పాష, చెన్నారెడ్డి, కృష్ణా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయంత్‌రాంతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు భూ పోరాటాలు

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు భూ పోరాటాలు ఆగవని సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌ఎన్‌ఆర్‌కాలనీ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కౌన్సిల్ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆర్కేనగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రతి పేదవాడి గొంతుక సీపీఐ అన్నారు. ఆర్కేనగర్ శాఖ కార్యదర్శి బైరగోని రాజుగౌడ్ ఆధ్వర్యంలో 50మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నర్సింహ, కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరిసింగ్‌నాయక్, వేణుగోపాలాచారి పాల్గొన్నారు.

సాహెబ్‌నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్‌కు అనుమతి..!

- సీసీపీకి బీజేపీ కార్పొరేటర్ల ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ జోన్‌లోని సాహెబ్‌నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ అభివృద్ధికి అనుమతులు ఇచ్చారని బీజేపీ కార్పొరేటర్లు ఆరోపించారు. గురువారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్‌నాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు లచ్చిరెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డిలు మాట్లాడుతూ బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో 65 ఎకరాల విస్తీర్ణంలో వెస్టర్న్ కన్‌స్ట్రక్షన్ సంస్థకు చెందిన భారీ లే అవుట్‌కు నిబంధనలు అతిక్రమిస్తూ పర్మిషన్ ఇచ్చారని ఆరోపించారు. చుట్టు పక్కల ఉన్న నాలుగు కాలనీల ప్రజలకు ఇబ్బంది కలిగేలా ప్రహరీ నిర్మించారన్నారు. జోనల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణ సంస్థతో లాలూచీ పడ్డారని ఆరోపించారు. ఈ విషయంపై తక్షణమే చర్యలు చేపట్టని పక్షంలో ఆందోళన చేస్తామని అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పెద్దఅంబర్‌పేట బ్యాంక్ కాలనీకి చెందిన స్టోన్‌వర్క్ లేబర్‌గా పనిచేస్తున్న మర్ల యాదయ్య(57) గురువారం ఎన్‌హెచ్ 65రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా ఇషాగ్రీన్‌కు ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అతన్ని చికిత్స నిమిత్తం ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో జరిగిన ఓ దశదిన కార్యక్రమంలో పాల్గొనేందుకు యాదయ్య వచ్చినట్లు పోలీసులు తెలిపారు. చికిత్స పొం దుతూ యాదయ్య మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం విక్రయ ముఠాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

హైదరాబాద్ సిటీ: రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న పలువురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. సివిల్ సప్లై అధికారులతో కలిసి హుమాయున్ నగర్, చిలకలగూడ, ముషీరాబాద్, మలక్‌పేట, యాకుత్‌పురా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి 9 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 46 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 4 క్వింటాళ్ల గోధుమలు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం వ్యాపారులుగా చెలామణి అవుతున్న అత్తాపూర్‌కు చెందిన విశాల్‌యాదవ్(22), ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ నాసిర్(28), వారాసిగూడకు చెందిన మహ్మద్ షోయబ్(20), మహ్మద్ జహంగీర్(28), ఎండీ షాబాజ్(28)సరూర్‌నగర్‌కు చెందిన సంగం లోవ అలియాస్ రాజు (24), పటేల్‌నగర్‌కు చెందిన సయ్యద్ రహీం(25), అంబర్‌పేటకు చెందిన సయ్యద్ రహీం(25), సయ్యద్ నిజాం(24), మహ్మద్ మజార్(28) రేషన్ బియ్యం దందా చేస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం సేకరించి, వాటిని అధిక ధరలకు బ్లాక్‌మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. సమాచారమందుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారిని అరెస్ట్ చేశారు.